# మిసెస్. ప్రేమలత



## అవధానుల జగన్నాథరావు

**ఉ**త్తరం మడిచి పక్కనున్న పుస్తకంలో పెట్టా. కూజాలోంచి గ్లాసుడు చల్లటి మంచి నీళ్ళు తాగేసరికి ప్రాణం లేచివచ్చినట్లయింది. మళ్ళాపోయి వాలు కుర్చీలో కూర్చున్నా.

నేనెప్పుడో ఇచ్చిన సలహా తన జీవన వైఖరినే మార్చిందట. ఇచ్చింది సలహాకాదే? నా జీవితంలో నేనెంతో ప్రాణపదంగా చూసుకుంటూ వస్తున్న డైరీలోని కొన్ని ముఖ్యమైన పుటల్ని కాపీ చేసి. చదువుకోమని తనకి చెప్పడం మినహాయించి ఏంచేశాను?

కాని నా జీవితాన్ని తనముందుంచాను. ప్రస్తుతం నీ సమస్యకు నా జీవితం ఓ సలహాయిస్తుందేమో? ఈ నాలుగు కాయితాలూ... చదివి ఓ నిర్ణయం తీసుకో. అంటూ ఆరోజు... మాధవికి... తన జీవితంలో ఎవరికీ చూపించని డైరీలోని కొన్ని ముఖ్యాంకాలు చూపించాను. గదిలోకి పోయి, గ్రాడెజ్ అలమరాలోనుంచి... పాత డైరీ ఒకటి తీసి... లోపలి ప్లాస్టిక్ అట్టవెనుక పెట్టిన కాయితాలు తీసా.

* * *

మాధవీ!

నువ్వు నామీద ఎంతో నమ్మకముంచుకొని సలహా అడిగావు. అందుకు ఆనందంగాఉన్నా... సమస్య జటిలమైంది. కాబట్టే... దానికి సలహా ఈయదల్చుకోలేదు. నేను చేయగలిగిందల్లా ఒక్కటే. ఈ సమస్యలో నీ వెన్నడూ ఊహించలేని మలుపుల్ని, లాభనష్టాన్ని, వివరంగా నీ ముందు ఉంచుతా. నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత నీది మాత్రమే''

నీ లతా టీచర్.

* * * *

జీవితంలో పదమూడవ మజిలీ. ఆనందరావుగారు ఇంట్లో ఉన్నపక్క వాటాలోకి అద్దెకు దిగారివాళే. మొహాలు చూసినప్పుడే అనిపించింది. ఎంతో మంచివాళ్ళని.


శ్రీరామ్...నువ్వొచ్చిన తర్వాత ఇంకెవరితోనూ మాట్లాడ బుద్ధిపుట్టడం లేదు. నీ చిరునవ్వు... మంచితనం... తెలివి తేటలు... నన్ను నిద్దుర పోనీయడం లేదు శ్రీరామ్!

ఎందుకో శ్రీరామ్ వాళ్ళ అమ్మగారిని పిన్నిగారని పిలవాలనిపించలేదు.

అమ్మ నాలోని మార్పు గమనిస్తూ నే ఉంది.

''అత్తయ్యగారూ! మీ యింట్లో జల్లెడ ఓసారి అమ్మ ఇమ్మంది''

అమ్మ వింటుందేమోనన్న భయంతో నెమ్మదిగానే అడిగాను.




"ఇందమ్మా! కోడలు పిల్లా!" ఆవిడ హాస్యంలోని నిర్మలత్వం పక్కనే ఉన్న శ్రీరావ్ కంటిలోని మెరుపు జీవితంలో మరిచిపోలేను. కానీ నేనలా సంబోధించడం అమ్మకెందుకో... అంతగా నచ్చలేదు.

ఎంతో ఆనందంగా తీసుకెళ్ళి జల్లెడ అమ్మకిచ్చా.

మొహం వాచేటట్లు చీవాట్లు వేసింది ఆవిడ్నలా పిలిచినందుకు.

బలవంతంగా ఆమెను మర్నాటినుంచి పిన్నిగారని పిలవవలసి వచ్చింది.

ఆ తర్వాత... అదే పద్ధతిలో జీవితంలో ఎంతో మంది అన్నయ్యల్ని సంపాయించాను. ఎన్నోసార్లు నాకిష్టంలేకుండానే.

*     *     *     *     *

జీవితంలో పద్దెనిమిదవ మజిలీ.

కాలేజీలో చేరి రెండేళ్ళయింది. మొదట్లో ఉండే పిరికితనం, బెరుకుపోయి, వాటిస్థానంలో ఆత్మ విశ్వాసమూ, ఉత్సాహమూ చోటు చేసుకున్నాయి.

బాగా చదివే నా ఆశయమల్లా "పి.హెచ్.డి. చేసి డాక్టర్ లత అనిపించుకోవాలని" అని. ఆ ఆశయసాధనకి నిర్విరామంగా కృషిచేసే దాన్ని, ఎమ్.ఎస్.సీలో సీటు సంపాయించాలంటే బి.యస్సీలో ఫస్ట్‌క్లాస్ తెచ్చుకోవాలి.

ఆ రోజు కెమిస్ట్రీ లెక్చరర్ రాలేదు. క్లాసు రూమ్ ఖాళీగా ఉంటే చదువుకుంటూ ఒంటరిగా కూర్చొన్నా.

ఎప్పుడూ పదిమందిని వెంట వేసుకుని తిరుగుతూ అందరికీ వినపడేటట్లు సిల్లీ జోకులు వేసుకుంటూ తిరిగే వెంకటేశం... సీరియస్‌గా [illegible]కి వచ్చాడు.

"ఏమండీ! మీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలి" అన్నాడు సీరియస్‌గా.

"చెప్పండి" - చిరునవ్వుని దాచుకో లేక పోయాను. అతని సీరియస్‌నెస్ చూసి.

"మీరంటే... నాకెంతో ఇష్టమండీ! మీ కభ్యంతరం లేకపోతే...మిమ్మల్ని... మిమ్మల్ని ..." అన్నాడు ముఖానికి పట్టిన చిరుచెమటని తుడుచుకుంటూ.

"పెళ్ళి చేసుకోవాలనుకున్నానంటారు..." అన్నాను నిష్కర్ష గా. వెంకటేశం ఏమీ మాట్లాడలేదు.

చూడండి వెంకటేశం! ప్రేమించడం... పెళ్ళి చేసుకోడం... టిక్కెట్లు తీసేయడం... సినిమా చూడ్డడం... అంత తేలికైన విషయాలు కావు. మనం ఇప్పుడున్నది బి.యస్సీ. సెకం




డియర్ లో మాత్రమే. ప్రేమించుకునేందుకు జీవితంలో ఇంకా చాలా టైముంది. ప్రేమ... పెళ్ళి వీటికన్నా ముందు చదువు... బాధ్యత అనే రెండు ముఖ్యమైన విషయాలున్నాయని మరచి పోకండి..."

ఎంతో ఆశలు పెట్టుకొనివచ్చిన వెంకటేశం నీరు కారిపోయాడు.

*     *     *     *     *

లాంగ్వేజెస్‌లో గోల్డ్ మెడలు వచ్చింది. జీవితంలో నేను నా ఆశయాన్ని సాధించగలనన్న నమ్మకం వచ్చింది.

ఫైనలియర్! పరీక్షలింక సమంగామూణ్ణెళ్ళు మాత్రమే ఉన్నాయి. అంత వరకూ అల్లరి చిల్లరిగా తిరిగిన వాళ్ళ మొహాల్లో కూడా టెన్షన్ చోటుచేసుకొంది.

లేడీస్ వెయిటింగ్ హాలులో కూర్చొన్నా.

సంతకం చేసి పోస్ట్‌మేన్ ఇచ్చిన లెటర్ తీసి... ఓ మూలకిపోయి ఓపెన్ చేశాను. అందరికీ తెలిసిపోయింది. అదేదో లౌ లెటర్ బాపతని.

లతగార్కి,

క్షమించండి. ఇలా letter వ్రాస్తున్నందుకు. మీ తెలివి తేటలు సింప్లిసిటీ నన్నెంతో ఆకర్షించాయి. మీకభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళి చేసుకుందామను కుంటున్నా. మీ అభిప్రాయం వ్రాయండి. పెర్సనల్‌గా చెబితే మీరు బాధపడతారేమోనని. ఆలోచించుకోడానికి వ్యవధి ఈయడానికి ఉత్తరం వ్రాశా. మీకిష్టం లేకపోతే లెటర్ చించి పారేయండి. మీ అభిప్రాయం వ్రాస్తారుకదూ.

—రజనీ కాంత్.

ఉత్తరం చదివిన వెంటనే ఒళ్ళు గగుర్పొడిచింది కోపంతో ముఖమంతా జేవురించి పోయింది.

ఎంత ఉన్నతంగా ఊహించుకొన్న... రజనీ కాంత్‌గారు... నా మీద ఇలాంటి ఆశలు పెంచుకున్నారా? లెక్చరర్‌గా పాఠం చెబుతూ నా వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం కేవలం నటనేనా?

ఆదర్శప్రాయంగా ఉండవలసిన అధ్యాపకులే ఇలా ప్రవర్తిస్తే ఇక కాలేజీలో జాయినయిన అమ్మాయులకు రక్షణ ఏదీ?

నా హృదయంలో ఎంతో సమున్నతస్థానంలో ఉన్న రజనీకాంత్ గారు తప్పుకున్నారు. ఆయన మీద అసుకోని కోపం. ద్వేషం బయలు

వేరాయి.

ఆలెటర్ బాగ్‌లో పెట్టుకొని ప్రిన్సిపాల్ రూమ్‌కి నడిచా.

చండశాసనుడైన ప్రిన్సిపాల్ నా ఎదురుగానే ఆయన్ని తనరూమ్‌లోకి పిలిపించాడు.

తలవంచుకొని... ప్రిన్సిపాల్ తిట్టిన తిట్లన్నీ ఏమాత్రం రియాక్షన్ లేకుండా విన్నారు రజనీ కాంత్.

కాగితం మీద రిజిగ్నేషన్ లెటర్ వ్రాసి ప్రిన్సిపాల్‌కి అందిస్తూ ప్రిన్సిపాల్ నీ, నన్నూ ఆయన అన్న మాటల్ని నాజీవితంలో మరచిపో లేదు.

"మీరు చెప్తున్నది పూర్తయితే నేనూ మీ యిద్దరికీ నాలుగు మాటలు చెబ్దామను కుంటు న్నా"

"ఒక వ్యక్తి కాలేజీలో లెక్చరర్ అయినంత మాత్రాన... ఎంత ఆదర్శప్రాయంగా ప్రవర్తించాల్సి ఉన్నా... అదే కాలేజీలో చదువు తున్న అమ్మాయిని ప్రేమించేహక్కు పెళ్ళి చేసుకునే హక్కు కోల్పోతాడా...? మీరే చెప్పండి"

"......" తెల్లబోయి చూడ్డం మాయిద్దరి




వంతయింది.

"మిస్ లత ఎక్కడ బాధ పడతుందోనన్న భయంతో... ఎంతో ఆలోచించి... ఆమె ఎటు వంటి పరిస్థితుల్లోనూ బాధపడకూడదని నే తీసుకొన్న జాగ్రత్తల్ని గమనించకుండా మీకు రిపోర్ట్ చేసిన... ఆమెనీ, ఆమెలాగే... అంధ కారంలో ఉన్న స్త్రీజాతినీ, అసలు కల్చర్‌లేని మన యువతరాన్నీ... ఎవరూ రక్షించలేరు!"

అంతవరకూ హిమవన్నగ మనుకొన్న కొండ అగ్నిపర్వతమని తెలిసినట్లయింది. ఆయన ఆవేశం చూస్తుంటే.

"ఆ అమ్మాయి తొందరలో రిపోర్ట్ చేసింది. మీరు వెంటనే ఆ అమ్మాయి ఎదుటే నాకు చివాట్లు వేశారు. మీరే చెప్పండి..."

"నేనా అమ్మాయిని... ప్రేమించడం తప్పా?"

"అంతపొలైట్‌గా, చాలా రిఫార్మ్‌డ్ వేలో నా ప్రేమను తెలియజేస్తూ తన అభిప్రాయం అడగడం తప్పా??"

నాకూ... ప్రిన్సిపాల్‌గారికీ మొహంలో నెత్తురు చుక్క కరువయింది. క్షమాపణ కోరు కుంటాడనుకున్న రజనీకాంత్ అలా ప్రవర్తించే సరికి ఎవరో మా కళ్ళు తెరిపించినట్లయింది.


నేను మనస్ఫూర్తిగా క్షమాపణ కోరుతూ... రిజిగ్నేషన్ వాపస్ తీసుకోమని అర్థించా.

ఆయన నా వైపు కూడా చూడలేదు.

ఆక్షణంలో కాలేజీ ఓ మంచి లెక్చరర్‌ని పోగొట్టుకుందని... అనిపించింది. కాని, జీవితం లో నేనేం పోగొట్టుకున్నానో తెలియడానికి మరో ఆరేడేళ్ళు పట్టింది.

* * * * *

ఎ.మ్మెస్సీలో జాయినయిన తర్వాత చదువు



మీద ధ్యాస కాస్త తగ్గి... జీవితం అంటే తరచి చూడ్డం కాస్త ఎక్కువయింది.

విద్యార్థీ, విద్యార్థినుల మధ్య తెరలు తొలగి కాస్త ఫ్రీగా ఉండటం అలవాటయింది. ఆడపిల్లల బెరుకు బాగా తగ్గినట్లే మగవారి ప్రవర్తనలోనూ బాగా తేడావచ్చింది. కాలేజీలో ఉండే తుంటరి తనం, అల్లరితగ్గి విద్యార్థిలోకంలో హుందాతనం చోటుచేసుకొంది. మనుషుల ప్రవర్తనలో ఆవేశాలు తగ్గి పరిణితి కనిపించసాగింది.

నా వైపు ఆరాధనా పూర్వకంగా చూసే కళ్ళు తగ్గిపోయాయి. అంతమంది విద్యార్థుల మధ్యనేనో దాన్ని ఐపోయాను.

అదే టైమ్‌లో కృష్ణమోహన్‌తో పరిచయమైంది ఇంజనీరింగ్ చదువుతున్నా...కవిత్వమన్నా కళలన్నా ఎంతో అభిరుచులున్న మనిషి కృష్ణ మోహన్ లైబ్రరీలో ఎంతో ఫార్మల్‌గా అయిన మా పరిచయం పెరిగి ప్రేమకు దారి తీసింది.

మేము బ్రాహ్మలం... కృష్ణమోహన్ కమ్మ వారబ్బాయి. ధైర్యంగా అమ్మానాన్నలకి మా ప్రేమ విషయం తెలియజేశా.

మొదటినుండీ ఛాందస వాతావరణంలో పెరిగిన అమ్మానాన్నలుమా పెళ్ళికి ససేమిరా ఒప్పుకోలేదు.

అయినా నేను నా పట్టువిడవలేదు.

శ్రేయోభిలాషులందరూ, ఆ పెళ్ళి మా కుటుంబం మీద ఎలా దెబ్బతీస్తుందో పని కట్టుకుని చెప్పారు.

నాన్న సన్యాసులలో కలసి పోతానని బెదిరించారు.

అమ్మ నూతిలో పడి చచ్చిపోతానని తన తుది నిర్ణయం తెలియజేసింది.

అప్పటికీ... కృష్ణమోహన్‌ని నా జీవితం నుండి దూరం చేయడానికి మనసొప్పలేదు.

పై రెండు బెదిరింపులకీ అంతగా బెదిరిపోని నా మనస్సు, కేవలం నా తర్వాత పెళ్ళి కావలసిన ముగ్గురు చెల్లాయిల భవిష్యత్ తలచుకొని లొంగి పోయింది.

ఆ విధంగా కృష్ణమోహన్‌ను నా జీవితం నుంచి బలవంతంగా తప్పించ వలసి వచ్చింది.

నే జేసిన త్యాగం...ఎంత అర్థంలేనిదో, తిన్నగా పదహారేళ్ళు నిండని చెల్లాయి, పద్మ పక్కింటి వాసుతో ధైర్యంగా లేచిపోయిన నాడే తెలిసొచ్చింది. నాన్న సన్యాసుల్లో కలసిపోలేదు. గాని... ఓ నెల్లాళ్ళు గెడ్డం పెంచి తర్వాత చికాకనిపించి తీసేశాడు.




అమ్మ చచ్చిపోలేదు గాని, సరిగ్గా ఏడాదికి పుట్టిన పండంటి మనవడిని చూసుకొని మురిసి పోయింది.

* * * * *

జీవితంలో పెద్ద చెప్పుకో తగిన మార్పులు లేకుండా ముప్పైవ ఏడు మెల్లగా వచ్చేసింది.

నాన్న ఎగ్రికల్చర్ డిపార్ట్‌మెంటులో ఆఫీసరు. నేను లెక్చరర్ని. నాకు తగిన వరుణ్ణి వెదకడంలో అలసిపోయి, ఓసారి హార్ట్ ఎటాక్ తెచ్చుకొని, ప్రాణభీతితో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు నాన్న.

ఆ వూళ్ళోనే తాలూకాఫీసులో గుమస్తాగా పనిచేస్తున్న చంద్రం బావని పెళ్ళి చేసుకోడానికి నాన్న హోదా నా ఉద్యోగం అడ్డుపడ్డాయి. అప్పటికీ సిగ్గువిడిచి అడిగిన ఆ వెర్రిబావకి అవమానమే ఎదురయింది.

తర్వాత. నా పెళ్ళి చేయకుండానే నాన్న కళ్ళు మూశారు.

పెద్దగా ఆస్తిపాస్తులు లేని మా కుటుంబానికి నేనే ఆధారమయ్యాను.

* * * * *

మాధవీ!


ఇంతవరకూ... నాజీవితంలో ప్రవేశించిన ముఖ్యమైన వ్యక్తుల్ని... వాళ్ళతో నేనెలా ప్రవర్తించానో. నేనెలా ప్రవర్తించవలసి వచ్చిందో వివరించాను నీకు.

ఎంతో ఆశగా నా జీవితంలో ప్రవేశిద్దామని ఏవో కారణాలవల్ల తప్పించుకున్న వెంకటేశాన్ని మా పక్కింటి అమ్మాయి ఓ పది వేలు ఎరచూపించి తన్నుకుపోయింది. కృష్ణమోహన్ స్టేట్సు వెళ్ళి అక్కడో అమెరికన్ యువతిని పెళ్ళి చేసుకొని అక్కడే సెటిలయి పోయాడు. రజనీ కాంత్ ఓ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా సెటిలయిపోయారు.

చూడు మాధవీ! స్నేహితులుగా కాలం గడిపితే... లోకం ఏమంటుందోనన్న భయంతో, **అజ్ఞానంతో** అమ్మ శ్రీరామ్‌ను ...నాకు అన్నగా తయారు చేసింది.

ఎంతో ధైర్యంగా నన్ను ప్రేమిస్తున్నానని చెప్పిన... వెంకటేశానికి చదువు, బాధ్యత లాంటి బరువైన పదాలకి అర్థంచెప్పి, కేవలం ఆశయం సాధిద్దామనే **ఆవేశంలో** ప్రేమ అంటే ఒట్టి నాన్సెన్స్ అని తెలియజేసి దూరం చేసుకున్నా.

ఎంతో సంస్కారయుతంగా తన ప్రేమను తెలియజేసిన రజనీకాంత్‌ను, కాలేజీ, పవిత్ర వాతావరణం, కేవలం కాలేజీలో చదువుకు తప్ప






ప్రేమకు చోటు లేదనే **అవివేకంతో** దూరం చేసుకున్నా.

నేను ప్రాణ ప్రదంగా ప్రేమించిన కృష్ణమోహన్‌ను నా నుండి కులం, సంఘం, అనే అర్ధంలేని **అతిశయపు** ఆలోచనలు దూరం చేశాయి.

నా గురించి ముప్పైఏళ్ళు పడిగాపులు గాసిన చంద్రం బావను, నా హోదా అనే **అహంకారపు** ముసుగులో కళ్ళు కన్పించక దూరం చేసుకున్నా.

**అజ్ఞానం... , ఆవేశం...,అవివేకం, అహంభావం, అతిశయం.**

ఈ భ్రమలకు లొంగిపోయి, నన్ను నన్నుగా ప్రేమించిన వారినందర్నీ నా నుండి దూరం చేసుకున్నా.

ఆ టైమ్‌లో ఎవరైనా సరైన సలహాయిచ్చి ఉంటే...?

నాకీ బలవంతపు బ్రహ్మచర్యం భయంకరమైన ఒంటరి తనం తప్పిఉండేదేమో?

ఆధునికతతో బాటు. వరకట్నమనే ఆటవిక వ్యవస్తకూడా రోజు రోజుకీ వృద్ధి చెందుతోంది.

దీనికి కారణం ఎవరు? వ్యక్తా? సంఘమా?

వెంటనే సంఘమనే సమాధానం చెప్పడం సుళువే...కానీ...!

ప్రతివ్యక్తీ ఆ తప్పులు తనకి తెలియకుండా తానే చేస్తూ సంఘాన్ని దుయ్యబట్టడంలో అర్ధం లేదు.

దయ్యాల మర్రిలా విస్తరిస్తున్న ఈవరకట్న వ్యవస్త పోవాలంటే...! పైపై కొమ్మలు నరికి లాభం లేదు.

యువతరం మధ్య అడ్డగోడలు తొలగిపోవాలి.

యువతీ యువకులు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి.

వ్యక్తిని వ్యవస్థ నుండి వేరు చేసి చూడ్డం నేర్చుకోవాలి.

'జీవిత సహచరుని ఎన్నుకు నే విషయంలో తుది నిర్ణయం మాదే' అన్న ప్రాథమికహక్కును యువతీ యువకులు. సంఘం నుంచి సంపాయించుకోవాలి.

ఓ దగా పడిన చెల్లెలి జీవితం ప్రేమను కొలిచే కొలబద్దగా ఉపయోగించే మూర్ఖత్వం పోవాలి.

సంఘం వి ధిం చి న కట్టుబాట్లు దురాచారాలు, కులమత బేధాలు, తరాల అంతరాలు, హోదాలబేధాలు, అన్నీ ప్రేమ ముందు శలబాల్లా మాడిపోవలసిందే.

ఇవన్నీ తలవంచేది నిష్కల్మషమైన ప్రేమ ముందే.

ప్రేమను మొగ్గలోనే త్రుంచివేసే తత్వాన్ని యువతులూ, ప్రేమించిన యువతిని కాలరాసే మూర్ఖత్వాన్ని యువకులూ వదులుకోవాలి.

ప్రతి యువకుడూ ప్రేమలేఖను నిజాయితీగానే వ్రాస్తాడనీ, ప్రతి ప్రేమా సఫలమవుతుందనీ, గుడ్డిగా నమ్మే మూర్ఖురాలినికాదు. నేను! అలా అని ప్రేమనీ... ప్రేమ లేఖనీ.., చులకనగా కూడా చూడలేను.

ఈ క్షణంలో అతను వ్రాసిన ప్రేమలేఖ... నిన్ను మోసగించడానికి పన్నిన ఉచ్చులా, అతని రాతలు అర్ధం పర్ధంలేని పిచ్చి గీతలుగా కనిపించ వచ్చు.

కాని... నీకోసం, రాజు తనవారినీ, తన ఆస్థినీ... త్యాగం చేయగలిగితే, జీవితంలో నేను నీకిచ్చే సలహా "ఆలోచించుకో!... అర్థం చేసుకో! అన్వయించుకో! నిర్ణయించుకో!" మాత్రమే.

* * *

ఆనాడు మాధవికిచ్చిన కాయితాలు పూర్తయాయి. తలంతా భారంగా వుంది. ఫ్లాస్కులో ఉన్న కాఫీ కాస్త తాగే సరికి కొద్దిగా హాయనిపించింది. మాధవి వ్రాసిన ఉత్తరం మళ్ళా తీసుకున్నా. దృష్టి ఆఖరిపేజీమీద నిలిచి పోయింది.

"మొన్న పదహారవ తేదీన మాకు పాప పుట్టింది. పాపకు ప్రేమతోబాటు మీ పేరు లత కలిపి 'ప్రేమలత' అనిపేరు పెట్టుకున్నాం. మీ ఆశీస్సుల్ని ఆశిస్తూ"

మీ మాధవి.

షెల్ఫ్ నుండి టెలిగ్రామ్ ఫారమ్ తీసుకుని, "స్వీట్ కిసెస్ ఎండ్ బెస్ట్ ఆఫ్ ఫ్యూచర్ టు ప్రేమలత" అని వ్రాసాను.

*